నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, బుధవారం 4 సెప్టెంబర్ 2024 | VIKARABAD

### ఓఆర్ఆర్ పరిధిలోని..
## 12 పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం
### గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం

రంగారెడ్డి, సెప్టెంబరు 3(నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తున్నది. ఇందులో భాగంగా మొదట ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని గ్రామ పంచాయతీలను సమీప మున్సిపాలిటీలలో విలీనం చేస్తున్నది. దీనిపై గత కొంతకాలంగా కసరత్తు చేస్తున్న ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీ సిఫారసు మేరకు మంగళవారం విలీనానికి సంబంధించిన ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. దీంతో రంగారెడ్డి జిల్లాలో 12 గ్రామ పంచాయతీలు సమీప మున్సిపాలిటీలలో విలీనం కానున్నాయి. బాచారం, గౌరెల్లి, కుత్బుల్లాపూర్, తారామతిపేట పంచాయతీలు పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలో విలీనం కానున్నాయి. అలాగే.. శంషాబాద్ మున్సిపాలిటీలో బహదూర్ గూడ, పెద్ద గోల్కొండ, చిన్న గోల్కొండ, హమీదుల్లా నగర్, రషీద్ గూడ, ఘంసీమియాగూడ పంచాయతీలు విలీనం అవుతున్నాయి. మీర్జాగూడ గ్రామపంచాయతీ నార్సింగి మున్సిపాలిటీలో, హర్షగూడ గ్రామపంచాయతీ తుక్కుగూడ మున్సిపాలిటీలో విలీనం కానున్నాయి. తక్షణమే గెజిట్ అమల్లోకి వస్తుందని ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నది.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
### హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్‌లను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్



సిటీబ్యూరో, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ) : భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పేర్కొన్నారు. హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ జంట జలాశయాలను హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. మరో వర్షం పడితే హిమాయత్ సాగర్ జలాశయం పూర్తిగా నిండిపోతుందని చెప్పారు. జలాశయం నిండితే దిగువ ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. మరో 5వేల క్యూసెక్కుల నీళ్లు వస్తే 10 గంటల్లో జలాశయం నిండి ఓవర్ ఫ్లో అవుతుందన్నారు. ప్రభుత్వ యంత్రాంగం హెడ్‌క్వార్టర్స్ వదిలపెట్టకుండా నిరంతరం విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. భారీ వర్షాల నేపథ్యంలో అవసరం ఉంటే తప్ప ఎవరూ బయటకు రావొద్దని సూచించారు. మంత్రి వెంట రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, బండ్లగూడ మేయర్ లతా ప్రేమ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

**జంట జలాశయాలకు తగ్గిన వరద..**

ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ రిజర్వాయర్లకు వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతాలైన శంకర్‌పల్లి, నవాబ్‌పేట, ఖానాపూర్, వికారాబాద్, పరిగి, చేవెళ్ల, మొయినాబాద్ తదితర ప్రాంతాల్లో మంగళవారం వర్షం ప్రభావం తగ్గడంతో జలాశయాల్లోకి వరద నీరు గణనీయంగా తగ్గింది. ఉస్మాన్‌సాగర్‌కు 800, హిమాయత్‌సాగర్‌కు 400 క్యూసెక్కుల నీరు చేరుతుంది. అయితే ఉస్మాన్‌సాగర్ గరిష్ఠ స్థాయి నీటి మట్టం 1790 అడుగులు కాగా..1785.55 అడుగుల మేర నీటి నిల్వలు ఉన్నాయి. హిమాయత్ సాగర్ గరిష్ఠ స్థాయి నీటి మట్టం 1763.50 అడుగులు కాగా.. 1759.80 అడుగుల మేర నీరు నిల్వ ఉంది. దాదాపు మూడున్నర అడుగుల మేర వరద నీరు వచ్చి చేరితే జంట జలాశయాల గేట్లు ఎత్తి దిగువన ఉన్న మూసీలోకి వదిలేందుకు జలమండలి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా జంట జలాశయాలను చూసేందుకు సందర్శకులు భారీగా వస్తున్నారు.

## నష్టం వివరాలను అందించండి
### అధికారులకు సూచించిన రంగారెడ్డి కలెక్టర్ శశాంక.. జిల్లాలో 42 ఇండ్లు ధ్వంసం

రంగారెడ్డి, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ) : వర్షానికి జరిగిన నష్టం వివరాలను వెంటనే సమర్పించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. రంగారెడ్డి కలెక్టరేట్ నుంచి మంగళవారం కలెక్టర్ శశాంక ఆర్డీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లాలో దాదాపు 40 ఇండ్లు పాక్షికంగా, రెండు ఇండ్లు పూర్తిగా కూలిపోయినట్లు గుర్తించామని కలెక్టర్ తెలిపారు. ఇండ్ల నష్ట పరిహారానికి సంబంధించిన నివేదికలు వెంటనే కలెక్టరేట్‌కు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమష్టిగా నాలాల పరిసరాలను పరిశీలించి, తగు జాగ్రత్తలు తీసుకునేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు తమ పరిధిలోని ఏదైనా విలువగల ప్రభుత్వ భూమి ఉన్నట్లయితే వెంటనే వాటికి కంచె ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని 100 చెరువులకు సంబంధించి ప్రిలిమినరీ నోటిఫికేషన్ పెండింగ్‌లో ఉన్నదని, ఇప్పటి వరకు 925 చెరువుల్లో 99 చెరువులకు మాత్రమే ఫైనల్ నోటిఫికేషన్ పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇంకా 820 చెరువులకు ఫైనల్ నోటిఫికేషన్ పూర్తి చేయాల్సి ఉన్నదన్నారు. వారానికి 30 నుంచి 40 చెరువుల సర్వే నిర్వహిస్తే నోటిఫికేషన్ ప్రక్రియ సకాలంలో పూర్తి చేయడం జరుగుతున్నదని తెలిపారు. కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో లాండ్ ప్రొటెక్షన్ అధికారి కేఎస్‌బీ కుమారి, తహసీల్దార్లు, ఆర్డీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


## కస్తూర్బాలో ముగ్గురు టీచర్లు సస్పెన్షన్
### ఏడుగురి టీచర్ల బదిలీ

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 3: శంషాబాద్ మండలం పరిధిలోని పాలమాకుల కస్తూర్బా గాంధీ హాస్టల్‌లో ఇటీవల జరిగిన పరిణామాలతో ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. మరో ఏడుగురు ఉపాధ్యాయులను ఇతర హాస్టల్స్‌కు పంపినట్లు చెప్పారు. బోధన ఉపాధ్యాయులతో పాటు బోధనేతర సిబ్బందిని బదిలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాలమాకుల గ్రామంలోని కస్తూర్బా గాంధీ హాస్టల్‌లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాను బోధించకపోవడంతో పాటు వారిని కులం పేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎస్‌వో మాధవి, టీచర్ ప్రశాంతి, ఏఎన్‌ఎం శాంతమ్మను సస్పెండ్ చేసినట్లు ఎంఈవో లక్ష్మణ్ నాయక్ తెలిపారు. మరో ఏడుగురిని ఇతర పాఠశాలలకు పంపించినట్లు పేర్కొన్నారు. ఈ హాస్టల్‌ను 15 రోజులకు ఒకసారి తనిఖీలు చేయాలని జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. విద్యార్థులు జాతీయ రహదారిపై ధర్నాకు దిగడంతో అధికార పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు ప్రతిపక్షాలకు చెందిన ఎమ్మెల్యేలు హాస్టల్‌ను సందర్శించి, విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా సహకరిస్తామని హామీ ఇచ్చిన మూడు రోజులకే ఉపాధ్యాయులపై చర్యలు మొదలయ్యాయి.

# వర్షం మిగిల్చిన నష్టం..
### సాయం కోసం రైతన్నల ఎదురుచూపులు..


నీట మునిగిన వరిపంట

**సీఎం ఇలాకాలో అన్నదాతల రోదనలు.. పంట నష్టం పరిశీలనలో ఆలస్యంపై రైతుల ఆగ్రహం**


నేలకొరిగి పూతరాలిన పత్తి పంట

కొడంగల్, సెప్టెంబర్ 3 : గత మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలు.. అన్నదాతలకు అపార పంట నష్టాన్ని మిగిల్చాయి. సాయం చేసి ఆదుకోవాలని రైతన్నలు ఎదురుచూస్తూ దిగులుచెందుతున్నారు. వానకాలం ప్రారంభం నాటి నుంచి కూడా ఈ ప్రాంతంలో ఆశించినంత మేరకు వర్షాలు కురవలేదు. ఇటీవల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురువడంతో చెరువులు, కుంటల్లో నీళ్లు చేరాయి. కాగా, పంటలు నీట మునగడంతో చేతికొచ్చిన పంటలు నీటిపాలయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని కొడంగల్, దౌల్తాబాద్ మండలాల్లో 13 గ్రామాల్లో వరి, కంది, పత్తి పంటలు పెద్ద మొత్తంలో నష్టపోయాయి. కొడంగల్ మండల పరిధలో 32 మంది రైతులకు సంబంధించి 46 ఎకరాల వరి, 10 మంది రైతులకు సంబంధించి 32 ఎకరాల్లో కంది పంట, 54 మందికి సంబంధించి 79 ఎకరాలు పత్తి పంట నీట మునిగినట్లు తెలిపారు. దౌల్తాబాద్ మండల పరిధిలో 39 మందికి సంబంధించి 52 ఎకరాల్లో పత్తి పంట, ఆరుగురు రైతులకు సంబంధించి 10 ఎకరాల్లో కంది పంట నష్టం జరిగిందని ప్రాథమికంగా అంచనా వేసినట్లు వ్యవసాయాధికారి ఏడీఏ శంకర్‌రాథోడ్ తెలిపారు. ప్రస్తుతం తమ దృష్టికి వచ్చిన పంటలను పరిశీలిస్తున్నామని ఏడీఏ పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇలాకాలో చాలా వరకు నష్టం జరిగినప్పటికీ పంట నష్టాన్ని లెక్కించడంలో అధికారులు చేస్తున్న జాప్యంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని కుదురుమల్ల గ్రామంలో రెండు ఎకరాల్లో సాగు చేసిన పెసర పంట కాస్త నీటి పాలై మొలకలెత్తాయని రైతు పంటను చూసి రోదిస్తున్నాడు.

ఇప్పటి వరకు కూడా ప్రజాప్రతినిధులు, అధికారులు రైతులను పరామర్శించిన దాఖలాలు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో పంట నష్టం వివరాలను సేకరించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. పంట నష్టంపై ఏడీఏ శంకర్‌రాథోడ్‌ను వివరణ కోరగా.. డివిజన్ పరిధిలో కంది, పత్తి, వరి పంట పెద్ద మొత్తంలో నీట మునిగినట్లు గుర్తించడం జరిగిందన్నారు. నీట మునిగిన పంటల్లో నీటిని తీసివేస్తే కొంతమేర నష్టాన్ని నివారించవచ్చని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్నామని, వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు.

**పంట నష్టంపై అధికారుల స్పందన కరువు..**



ఇటీవల కురిసిన వర్షాలకు పంట ధ్వంసమైంది. రెండు ఎకరాలు కంది, ఎకరం పత్తి పంటలను సాగు చేశా. చేతికొచ్చిన పంట నేలపాలైంది. మా గోడును పట్టించుకునే నాథుడే లేడు. దాదాపు రూ.లక్ష వరకు పంట నష్టం జరిగింది. ఇప్పటి వరకు అధికారులు ఎవరూ స్పందించలేదు. కనీసం నీట మునిగిన పంటను పరిశీలించలేదు.
– రాజశేఖర్, పాతకొడంగల్, కొడంగల్

**అధికారులు పంట నష్టాన్ని గుర్తించాలి..**



వేసిన పంటంతా నీటిపాలైంది. 4 ఎకరాల్లో మినుము, పెసర పంటలను సాగు చేశా. ప్రస్తుతం పంట కోత దశకు వచ్చింది. వర్షాలు కురవడంతో మినుము, పెసర పంట మొలకెత్తింది. అధికారులు స్పందించి పంటను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం నష్టపోయిన రైతులందరినీ ఆదుకోవాలి.
– మోహన్ యాదవ్, పాత కొడంగల్

**చేతికొచ్చిన పంట నీటి పాలైంది..**



చేతి కొచ్చిన పంట నీటి పాలైంది. రెండు ఎకరాల్లో దాదాపు రూ.30వేలు పెట్టుబడి పెట్టి పెసర పంట సాగు చేశా. ఈసారి పంట బాగా కాసింది. కోతకొచ్చిందని సంతోషపడే సమయానికే వాన దేవుడు ముంచేసిండు. సుమారుగా రూ.లక్ష వరకు నష్టం వచ్చింది. అప్పు చేసి సాగు చేశా. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.
– సాయిలు, కుదురుమల్ల, దౌల్తాబాద్ మండలం, కొడంగల్

# ‘ఇన్‌స్పైర్’ కావట్లే..!

**ఇన్‌స్పైర్ మనక్‌పై ఉన్నత పాఠశాలల అనాసక్తి**

**ఈ ఏడాది నామినేషన్ల లక్ష్యం 6,005**

**ఇప్పటివరకు వచ్చిన నామినేషన్లు కేవలం 304 మాత్రమే**

**ప్రైవేటు స్కూళ్ల నుంచి వచ్చినవి కేవలం మూడు నామినేషన్లే**

**గత ఏడాది 1,780 నామినేషన్లతో ప్రథమ స్థానంలో నిలిచిన రంగారెడ్డి జిల్లా**

**గడువు ముగిసిపోతున్నా కనిపించని స్పందన**



రంగారెడ్డి, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ) : పాఠశాల స్థాయి నుంచే సృజనాత్మక ఆలోచనలు చేసేలా విద్యార్థులను ప్రోత్సహించేందుకు విద్యాశాఖ నిర్వహిస్తున్న ‘ఇన్‌స్పైర్ మనక్’పై పాఠశాలలు అంతగా ఆసక్తి చూపడం లేదు. జూలై 1 నుంచి ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ సెప్టెంబర్ 15తో ముగియనున్నది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు నిరాసక్తత చూపడంతో ఇప్పటివరకు కేవలం 304 నామినేషన్లు మాత్రమే వచ్చాయి. ఉత్తమ ప్రదర్శనలకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడంతో పాటు స్టార్టప్‌గా అవతరించే అవకాశం ఉన్నప్పటికీ విద్యార్థులను ప్రోత్సహించకపోవడంపై పాఠశాలల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రతి పాఠశాల నుంచి 5 ప్రాజెక్టులు..**

కేంద్ర శాస్త్ర సాంకేతిక మండలి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా ‘ఇన్‌స్పైర్ మనక్’ పేరిట ఏటా అవార్డులను అందజేస్తున్నాయి. 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు అభ్యసించే విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. ఉన్నత పాఠశాలల నుంచి ఐదు చొప్పున, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి మూడు చొప్పున నామినేషన్లను స్వీకరిస్తారు. పోటీల్లో పాల్గొనే పాఠశాలలు వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఆన్‌లైన్‌లో ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందులో ఎంపికైన విద్యార్థి జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో తమ ప్రాజెక్టును ప్రదర్శించేందుకు రూ.10వేల చొప్పున పారితోషికం అందిస్తారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపిస్తారు. అక్కడ ప్రతిభ చాటితే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తున్నది. ఈ స్థాయి ప్రాజెక్టులకు ప్రభుత్వం పేటెంట్ హక్కులను కల్పిస్తున్నది. జాతీయ స్థాయి పోటీలో రాణిస్తే రాష్ట్రపతి, ప్రధానమంత్రిని సైతం కలవొచ్చు. ప్రాజెక్టులకు వాస్తవిక రూపాన్నిచ్చి స్టార్టప్‌లుగా రూపొందించేందుకు సైతం ప్రోత్సాహం అందుతున్నది.

**ఈసారి ఇన్‌స్పైర్ కావట్లే..!**

గత ఏడాది జిల్లావ్యాప్తంగా పాఠశాలలు 1,780 నామినేషన్లను అందజేయడంతో రంగారెడ్డి జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఈసారి నామినేషన్లకు ముందుకు రాకపోవడం అందరినీ విస్మయం గొలుపుతున్నది. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలలు ఇన్‌స్పైర్‌కు నామినేషన్లను సమర్పించడంలో నిర్లక్ష్యాన్ని కనబరుస్తున్నాయి. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూళ్లు, కస్తూర్బా, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్ పాఠశాలలు కలిపి మొత్తం 1,201 పాఠశాలలు ఎస్సీఈఆర్టీలో నమోదై ఉన్నాయి. ఈ లెక్కన ప్రతి పాఠశాలకు 5 చొప్పున మొత్తం 6,005 నామినేషన్లు రావాల్సి ఉన్నది. కానీ.. ఇప్పటివరకు వచ్చిన నామినేషన్లు కేవలం 304 మాత్రమే. ప్రైవేటు హైస్కూళ్లు జిల్లాలో 850 వరకు ఉండగా.. కేవలం మూడు పాఠశాలలు మాత్రమే ఇన్‌స్పైర్‌కు నామినేషన్ వేశాయి. ఈసారి మొత్తంగా 40 పాఠశాలలు మాత్రమే ఇన్‌స్పైర్‌లో ప్రాజెక్టుల వివరాలను నమోదు చేశాయి. వినూత్న ఆలోచనలతో రాణిస్తున్న పాఠశాల విద్యార్థులు జిల్లాలో చాలా మంది ఉన్నారు. గతంలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనల్లోనూ ఎంతోమంది ప్రతిభను కనబర్చారు. ఈ ఏడాది చేవెళ్ల ఆదర్శ పాఠశాలలో ఇంటర్ చదువుతున్న సర్వజిత్ అనే విద్యార్థి ప్రతిభ కనబర్చి జపాన్‌లో జరిగే ప్రదర్శనకు ఎంపికయ్యారు. రాష్ట్రం నుంచి నలుగురు ఎంపిక కాగా.. అందులో సర్వజిత్ ఒకరు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసే ఇన్‌స్పైర్ మనక్‌లో విద్యార్థులను భాగస్వామ్యులను చేయడంలో పాఠశాలల యాజమాన్యాలు చొరవ చూపకపోవడం విమర్శలకు తావిస్తున్నది.

**పాఠశాలలు ప్రత్యేక చొరవ చూపాలి..**



విద్యార్థులు బాల శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఇన్‌స్పైర్ మనక్ చక్కని వేదిక. ఈ పోటీలో అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొనేలా యాజమాన్యాలు ప్రత్యేక చొరవ చూపించాలి. ఇప్పటివరకు చాలా తక్కువ సంఖ్యలో నామినేషన్లు వచ్చాయి. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలలు ఆసక్తి చూపడం లేదు. గత ఏడాది మాదిరిగానే ఈసారి జిల్లా నుంచి అత్యధిక నామినేషన్లు నమోదయ్యేలా చూడాలి. నేడో, రేపో అన్ని పాఠశాలలతో రివ్యూ నిర్వహిస్తాం.
– సుశీంధర్‌రావు, డీఈవో, రంగారెడ్డి జిల్లా

**విద్యార్థులకు చక్కని అవకాశం..**



విద్యార్థులు తమలోని సృజనాత్మకతను ప్రదర్శించేందుకు కేంద్ర శాస్త్ర సాంకేతిక మండలి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ‘ఇన్‌స్పైర్ మనక్’ ఎంతో దోహదపడుతున్నది. అద్భుతమైన అవకాశాన్ని అందిపుచ్చుకునేలా విద్యార్థులను పాఠశాలల ఉపాధ్యాయులు ప్రోత్సహించాల్సిన అవసరం ఉన్నది. రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిల్లో జిల్లా ఖ్యాతిని చాటడమే గాక, విద్యార్థుల మంచి భవిష్యత్తుకు పునాది ఏర్పడుతుంది.
– వై.శ్రీనివాసరావు, జిల్లా సైన్స్ అధికారి



## అనంతగిరికి పర్యాటకుల తాకిడి

వికారాబాద్, సెప్టెంబర్ 3 : అనంతగిరి అందాలను చూసేందుకు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల నుంచి పర్యాటకులు మంగళవారం తరలి వచ్చారు. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు అనంతగిరిలో వాటర్ ఫాల్స్ వచ్చాయి. వీటిని చేసేందుకు పర్యాటకులు తరలివచ్చారు. ఎత్తైన కొండలు పచ్చని ప్రకృతి, చల్లని వాతావరణంలో పర్యాటకులు ఆనందంగా గడిపారు. అధిక సంఖ్యలో అనంతగిరికి చేరుకొని వాటర్ ఫాల్స్ వద్ద ఫొటోలు దిగారు. తెలంగాణ ఊటీగా పిలువబడుతున్న అనంతగిరిలో పర్యాటకులు సరదాగా గడిపారు. అనంతగిరి అందమైన అందాలను చూస్తూ పర్యాటకులు ఆనందంతో మురిసి పోయారు. వాటర్‌ఫాల్స్ వద్ద ప్రమాదాలు జరుగకుండా అటవీ శాఖ అధికారులు భద్రతా చర్యలు తీసుకున్నారు.

